# 1. పోస్టు గ్రాడ్యుయేట్ ది గ్రేట్

## POST GRADUATE THE GREAT

రామనాథంగారి హృదయం భరింపరాని వేదనాభరిత మైయుంది. అతని కళ్ళవెంబడి ధారాపాతంగా కన్నీరు కారు చున్నది. కూతురు బిడ్డ పుట్టువెంటుర్లకలని పోయిన తనకు అక్కడ జరిగిన అవమానాగ్నిలో అతడు దహించుకుపోతు న్నాడు. ఈ సమస్య నెలా పరిష్కరించాలో అతని కెంత ఆలోచించినా తోచడంలేదు. ఎన్నో సమస్యలను సునాయా సంగా పరిష్కరించిన లెక్కల మాస్టారు రామనాథంగారికి తన గృహ సమస్య పరిష్కారంలేని ఫజిల్లా తయారయింది. తనకున్న మాస్టరు ఉద్యోగంతో అల్లుడి గొంతెమ్మ కోర్కె ఎలా తీర్చాలి? ఉన్నదంతా ఒక కూతురుకే ఊడ్చిపెట్టినచో మిగతా పిల్లల గతేంకావాలి? కట్నం యివ్వలేని తండ్రి కన్నబిడ్డ గడప త్రొక్కడానికైనా అర్హుడుకాడా? అన్నీ చెల్లించి కొంత డబ్బు తక్కువైనందుకే అల్లుడు తనసీవి ధంగా అవమానిస్తాడా? కట్నంముందు మామ అన్న గౌర వముకూడా అక్కర్లేదా? అల్లుడు ఎం. ఏ. పాసయ్యాడు. సంస్కారవంతుడనుకున్నాను. ఇదేనా పోస్టుగ్రాడ్యుయేట్ గారి సంస్కారం? ఇదేనా నవనాగరికత? కట్నం యివ్వలేని

తండ్రి ఈ నాగరిక ప్రపంచంలో జీవించకూడదా? అల్లుడి ఎంఏ, చదువు తనకీ నీతినే బోధించిందా? కట్నంముందు మామ, అల్లుడు బంధుత్వమమకారాలకు తావేలేదా? నలుగు రాడపిల్లలున్న నావంటివాని గతేంకావాలి? నావంటి నిర్భా గ్యులు ఈభువిపై ఎందరున్నారో డబ్బుకై తననే ఇన్నిమాట లన్న అల్లుడు తన బిడ్డను చక్కగా చూస్తాడన్న నమ్మకమే మున్నది? ఈ కట్నాలకొరకై ఎందరెందరి నిర్భాగ్యురాళ్ళ బ్రతుకులు నాశనమైపోతున్నాయో! అని పరిపరి విధాలుగా ఆలోచిస్తున్న రామనాథంగారికి అల్లుడు తన నవమానించిన ఒక్కొక్క విషయం జ్ఞాపకం రా సాగింది.

రామనాథంగారు జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్‌లో లెక్కల మాష్టారు. అతడు నలుగు రాడపిల్లలు, ముగ్గురు మగపిల్లల కుచేల సంతానంతో జీవిత నౌకను అతి కష్టంగా లాక్కొస్తున్నాడు. పెద్దబిడ్డయగు వనజను అక్క కొడుకగు ఆనంద్ కిచ్చాడు. ఆనంద్ ఎం. ఏ. పాసయ్యాడు. కరెంట్ ఆఫీసులో యు. డి. సి. గా ఉద్యోగం వెలుగపెడుతున్నాడు. అల్లుడి ఉద్యోగంతో కూతురు సుఖపడ్తుందని తలచాడు- పేద రామనాథం. కాని అల్లుడెంత సంస్కారో అతని పోస్టుగ్రా డ్యుయేషన్ డిగ్రీ అతని కెంత నాగరికతను నేర్పిందో పెళ్ళ యిన ఆరు నెలల్లోనే రామనాథంగారి కర్థమైంది. పెళ్ళైన ఆరి నెలలకు దీపావళిపండుగ వచ్చింది. పండుగకు అల్లుణ్ణి, కూతుర్ని పిలిచాడు. దీపావళి కట్నంగా తనకు పెళ్ళిలో

యిస్తామన్న స్కూటర్ యివ్వాలన్నాడు. ఆర్నెల్ల క్రితమే పెళ్ళిఖర్చులతో అప్పులపాలైన రామనాథంగారు అప్పుడా కోర్కెను తీర్చలేనన్నాడు. ఆనంద్ ది గ్రేట్ మామగారి మీద మండిపడ్డాడు. పెళ్ళిలో ఒప్పుకున్న స్కూటర్ ఖచ్చితంగా యివ్వాలని పట్టుబట్టాడు. రామనాథంగారికి ఎన్ని విధాల ఆలోచించినా అల్లుడి కోర్కె నెలా తీర్చాలో తెలియు లేదు. మెల్లగా అల్లుడిని సమీపించి "నాయనా! ఆనంద్, ఇప్పుడు నేను స్కూటర్ యిచ్చే పరిస్థితిలో లేను. కొంచెం కుదుటపడ్డాక తప్పకుండా యిస్తాను. కొంచెం ఓపికపట్టు" అన్నాడు విచార వదనంతో.

ఈ మాటలు విన్న మన కథానాయకుడు అగ్గిమీద గుగ్గిలమై "నాకు మీ కట్నంవద్దూ, మీ పిల్లావద్దు. కట్నం యివ్వలేనివాడు బోడి వాగ్దానా లెందుకు చేయాలి? నాకు స్కూటర్ యిచ్చేంతవరకు మీ కూతురును కాపురానికి తీసుకపోను"- అని ఎవరాపినా ఆగకుండా వెళ్లిపోయాడు ఎం. ఏ. ది గ్రేట్.

కట్నంకొరకు కట్టుకున్న భార్యనుకూడ విడనాడుటకు వెనుదీయలేదు నవనాగరికత.

ఆ మాటలు విన్న అమాయకురాలైన వనజ కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. ఒక అల్పుడైనవాని మాటలను నమ్మి భార్య శీలాన్ని శంకించి నిండుచూలాలు ఐన భార్యను అడవులకు పంపించిన భర్తకే, జన్మజన్మలకు భార్యగా పుట్టా

లనుకొన్న సీతామతల్లులు, భర్తనే వారకాంతలవద్దకు స్వయముగా తీసుకొనిపోయిన అంగణామణులు పతివ్రతామ తల్లులుగా, ఆ భర్తలు పూజనీయులుగా కీర్తింపబడుతున్న ఈ పవిత్ర భారతదేశంలో వనజలాంటి మధ్యతరగతి సంస్కారం గలస్త్రీ ఏంచేయగలదు? భర్త నిరాదరణకా అమాయకప్రాణి కుమిలి కుమిలి ఏడవసాగింది.

కూతురి దైన్యస్థితి చూసిన రామనాథంగారి కేంచేయాలో తల బద్దలుకొట్టుకున్నా తోచలేదు. చివరకు భార్యపైనున్న నగలన్నీ అమ్మి అల్లుడికి స్కూటర్ కొనిచ్చి కూతురును కాపురానికి పంపాడు. ఆర్థిక సమస్యలతో, అల్జీబ్రా ప్రాబ్లమ్స్‌తో సతమతమౌతున్న రామనాథంగారికి తన కూతురి సమస్యకు అంతకంటె మంచి పరిష్కారం లభించ లేదు. అప్పటికైనా తన కూతురు సుఖపడ్తే అంతేచాలు ననుకొన్నాడు.

తర్వాత కొద్దిరోజులకు రామనాథంగారి పెద్దకొడుకు పెళ్లి జరిగింది. పెళ్ళంతా సాఫీగానే జరిగింది. కాని అల్లుడి లాంచనందగ్గర వచ్చింది పంచాయితీ. బావమరది పెళ్లికట్నముగా తన భార్యకు తులం బంగారం, తనకు అరతులం ఉంగరం పెట్టాలన్నాడు ఆనంద్. అల్లుడి కోరిక రామనాథం హృదయంపై పిడుగులా పడ్డది. రామనాథం సంచలిత హృతయంతో "ఆనంద్, పెళ్లి ఖర్చులతో, కట్నాలు కానుకలతో ఇపుడు ఖర్చుల్లో ఉన్నాను. ఇంత కట్నం యిచ్చే పరిస్థితిలో

లేను. ఒక ఉంగరంతో సరిపుచ్చుకో" అన్నాడు- దీనంగా బ్రతిమాలుతున్న ధోరణిలో. ఆ మాటలు మన ఆనంద్ ఎం.ఏ. గాని సంస్కార హృదయానికి నచ్చలేదు. మామ ఖర్చులో బడి ఉంటే తనకేం సంబంధమున్నది? తనక్కావల్సింది తన కట్నం. 'నా స్నేహితులు మీ బావమరిది పెళ్ళికట్నం ఇదేనా అంటే నేనేంచేసేది' అని పోస్టు గ్రాడ్యుయేట్ గారి హృదయం పరితపించింది పాపం. ఎవరెక్కువ కట్నం తెచ్చుకుంటే వాళ్లు గొప్పవాళ్ళుగా పరిగణింపబడుతున్న నవనాగరిక సమాజంలో ఆనంద్ కిట్టి ఆలోచన రావడం సహజమేనేమో!

"నాకు మీ ఖర్చులతో సంబంధంలేదు. నా కట్నం నాకు ముట్టాల్సిందే డబ్బులేనిచో అప్పుచేసైనాసరే నాకట్నం యివ్వండి- లేదా బాగుండదు" అన్నాడు రోషంగా.

కట్నంకొరకు మామ నప్పులపాలు కమ్మనుటకుకూడా వెనుకాడలేదు ఎం. ఏ సంస్కారం.

"ఏమయ్యా! ఆనంద్, నీ కట్నంకొరకు మామ నప్పుల పాలు కమ్మంటావా? పెద్దవాళ్ళ నలా అనవచ్చునా? మంచి చెడు జ్ఞాన మవసరంలేదా?" అన్నాడొక పెద్దమనిషి.

"పరాయివాళ్ళ నడిగినట్టు యిదేమిటానంద్, మేన మామ అని ఐనా చూడనవసరంలేదా" అన్నాడు వేరొక పెద్దమనిషి.

'అందుకే దరిద్రపుగొట్టు మేనరికాన్ని చేసుకోవద్దని చెప్పాను- విన్నారుకాదు మా తల్లిదండ్రులు. ఛీ ఏమి బంధు

త్యము? వేరే సంబంధమైతే ఇంకా ఎక్కువ కట్నమే వచ్చేది. కట్నమివ్వలేనివాడు పిల్లనెందుకివ్వాలి? నన్ను పెళ్ళికెందుకు పిలవాలి? అన్నాడు ఎం. ఏ.

ఆ మాటలకు అక్కడున్నవాళ్ళంతా తెల్లబోయారు. ఇంకా మాటలు పెంచినచో వ్యవహారం ముదురుతుందని తలిచారు. ఒక పెద్దమనిషి రామనాథం చెవిలో ఏదో ఊదాడు. రామనాథం జీవచ్ఛవంలా ఆనంద్ దగ్గరికి వచ్చి 'బాబూ! ఇప్పుడీ ఉంగరం తీసుకో- అర్నెల్లలో మిగతా బంగారం ఇస్తాను' అని కొడుకుచేతి ఉంగరాన్ని అతనికిచ్చి కాళ్ళుపట్టుకున్నాడు.

అయినా మన యు డి. సి. డి గ్రేట్‌గారి మనసు కరుగలేదు. ఆనంద్ నాగరిక హృదయానికి మామగారి మాటలే మాత్రం చెవికెక్కలేదు.

నాకు మీ ఉంగరమూవద్దు- బంగారమూవద్దు. నా కట్నం యిచ్చేవరకు మీ బిడ్డ మీ యింట్లోనే వుంటుంది. అని ఆఖరి అస్త్రం ప్రయోగించి కాలర్ సరిచేసుకుంటూ నడవసాగాడు మన కథానాయకుడు.

భర్త మాటలతో భరింపరాని శోకతప్తయైన వనజ ముఖాన్ని చూసిన ఒక పెద్దమనిషి 'నాయనా! ఆనంద్, నీ కట్నంకొరకు భార్యనుకూడా వదులుతానని ఆమె కెంత దుఃఖాన్ని కలిగించావు? ఒక బిడ్డ తండ్రివై కూడా నీవిట్లు మాట్లాడుట న్యాయమా? నీ మాటలవల్ల నీ భార్య ఎంత

కుమిలిపోతున్నదో చూడు అన్నాడు' ఆనంద్‌ను సమీపించి.

అయినా సంస్కార హృదయం కరుగలేదు. తనకు భార్య దుఃఖంతో పనిలేదు. ఏదేమైనప్పటికి తనక్కావల్సింది తన కట్నం. ఆ మాటలన్న మనిషివైపొకసారి ఉరిమిచూసి తన నడక సాగించాడు ఆనంద్.

భర్త వదిలిపెట్టిన స్త్రీని, స్త్రీకూడా శత్రువుగాచూస్తూ ఈ సమాజం ఎంత హేళనచేస్తుందో తెలిసిన రామనాథం అసహాయకురాలైన కూతురు కాపురం నిలబెట్టడానికై తన భూమిని తాకట్టుపెట్టి సంవత్సరానికి 50 శాతం వడ్డీకి అప్పు తెచ్చి అల్లుడి కోర్కె తీర్చాడు.

ఇపుడు పెళ్ళిచేసుకొంటే ఎక్కువ కట్నం వచ్చేదని వనజను గుణిపించడం, దిక్కుమాలిన సంబంధమని తిట్టడం, ఆమె నొక బానిసకంటే అధ్వాన్నంగా చూడడం, రామనాథంగారికి తీరని బాధను కల్గించాయి. అంతేకాకుండా భార్యకు కొలిచి బియ్యము, పప్పులు యివ్వడం, అప్పుడే యింత ఖర్చయిందా అని ఆమెను గుణిపించడం ఆనంద్ ది గ్రేట్ గారి సంస్కార స్థాయిని కళ్ళకుకట్టినట్టు చూపిస్తాయి.

కూతురి కాపురాన్నిగూర్చి చింతాక్రాంతుడైయున్న రామనాథంగారికి మొన్న మనమరాలి పుట్టువెంట్రుకలకై పోయినపుడు జరిగిన అవమానం మరీ భరింపరానిదిగా ఉంది. మనుమరాలి పుట్టువెంట్రుకలకై ఆహ్వానంవస్తే తన శక్తికి తగినట్టుగా అరతులం బంగారం కట్నంగా తీసికొని

పోయిన రామనాథంగారిని అల్లుడు నానా విధాలుగా అవమానించాడు.

గతిలేని సంబంధం, దిక్కుమాలిన సంబంధం, తన హోదాకు ఆ కట్నం అవమానకరమని ఎన్నో మాటలు తిట్టి అతని బంధువులముందే అవమానించి పంపాడు.

అల్లుని అమానుష ప్రవర్తనకు రామనాథంగారు కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు. ఆడపిల్లను కన్న నేరానికి వాళ్ళన్నట్లు పడాలా? రోజూ పేపర్లలో డబ్బుకోరకై ఆడపిల్లల హత్యలు, ఆత్మహత్యలగూర్చిన వార్తలు ఎంత హృదయ విదారకము? కట్న పిశాచపు విషకోరలలో ఎంతమంది అభాగ్యురాళ్ళ జీవితాలు భగ్నమై పోతున్నాయి? పెళ్ళైతే కట్నం, పుట్టువెంట్రుకలకు కట్నం, శోభనానికి కట్నం, గృహప్రవేశానికి కట్నం, ప్రతిదానికి కట్నం. దీనికి అంత మెప్పుడు? హేతువాద జ్వాలలతో నమసమాజంవైపు ప్రపంచమడుగిడుతున్న ఈనవశకంలో కూడా యువతరం యింకా అటవికకాలంనాటి నాగరికతను పట్టుకు వ్రేలాడటం సబబా? నేటి నవసమాజానికి ప్రతినిధులైన యువతరం ఇంకా కుళ్ళు పట్టిన సాంప్రదాయాలను పట్టుకొని వ్రేలాడడం ఎంత దారుణం? కట్నాన్ని నిర్మూలిస్తామని, కట్నం తీసుకొనుట నేరమనీ, వేదికలెక్కి ఉపన్యాసాలిచ్చే నాయకమన్యులు కట్నాన్ని స్వప్నాలలో నిర్మూలిస్తారేమో, కట్న పిశాచపు కబంధ హస్తాలనుండి ఆడపిల్లల తల్లిదండ్రులు, అమాయకు

రాళ్ళయిన ఆడపిల్లలు బయటపడే మార్గమేలేదా? కట్నం విధానం నశించాలి. వరకట్న దురాచారం అడుగంటాలి" అన్న మాటలనేకసార్లు రామనాథంగారి నోటినుండి వెలువడ్డాయి. వరకట్న దురాచార నిర్మూలనకై ప్రతినబూనుతూ అతని పిడికిళ్లు బిగుసుకున్నాయి.

యువతరానికి విజ్ఞప్తి :- పుట్టుకతోనే వృద్ధులైన ఓ! కొంతమంది యువకులారా! కుళ్ళుపట్టి కంపుకొడుతున్న సాంప్రదాయాలకు బానిసలై అప్పణంగా లభించే డబ్బుకై అమాయకురాళ్లయిన సోదరీమణులను పీడించి వాళ్ళ జీవితాలను నరకప్రాయం చేయకండి!

'కలకంఠి కన్నీరొలికినచోట నాశనం తప్పదు.'

(అన్నపూర్ణ – ఏప్రిల్, జూన్ 82)

# 2. ఇదేనా ఇంటర్వ్యూ?

ఎండ విపరీతంగా కాస్తుంది. ఇంటర్వ్యూ కొచ్చిన యువకులంతా చెట్లక్రింద గుంపులు గుంపులుగా గుమిగూడారు. భరింపరానిదైన ఆ ఎండ వేడికి చెమటలు ధారాపాతంగా కారుచున్నవి. బెల్‌బాటం ప్యాంట్లూ, రంగురంగుల బుషర్టులన్నీ తడిసి ముద్దయినవి. కళకళలాడుతూ ఉండాల్సిన ముఖాలన్నీ చెమటచే జిడ్డుగా తయారై వెలవెలబోవుచున్నవి. ఉదయం 9 గం॥కు ప్రారంభంకావల్సిన ఇంటర్వ్యూ